నవతెలంగాణ
ఆదిలాబాద్
ఆదివారం | డిసెంబర్ 15, 2024 | www.navatelangana.com

సమగ్ర ఉద్యోగుల సమ్మెకు వెల్లువెత్తిన సంఘీభావం

ఆదిలాబాద్‌టౌన్ : సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని పీఆర్టీయు టీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ కుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న దీక్ష శిబిరాన్ని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి, ఇతర నాయకులతో కలిసి సంఘీభావం తెలిపారు. ఉపాధ్యాయులను సమగ్ర శిక్ష ఉద్యోగుల స్థానంలో డిప్యూటేషన్‌పై వెళ్లొద్దని సూచించామన్నారు. అలాగే దీక్ష శిబిరాన్ని ఎంఈఓలు ఉదయ్‌రావు, బిక్కులాల్, సునీల్, టియుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్‌రెడ్డి, డిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, వృకోదర్, వివిధ సంఘాల ముఖ్య నాయకులు సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.



కవి ఉదారి నారాయణకు పురస్కారం

ఆదిలాబాద్‌టౌన్ : జిల్లాకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ ఉదారి నారాయణను పురస్కారం వరించింది. శనివారం సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో వెన్నెల సాహితి సంగమం కార్యక్రమం నిర్వహించారు. దీనికి కవి డాక్టర్ ఉదారి నారాయణను ఆహ్వానించి 2023 సంవత్సర పురస్కారంతో పాటు రూ.5వేల నగదు, ప్రశంస పత్రం అందజేశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాహితీ సంగమం సంఘం అధ్యక్షుడు వంగర నరసింహ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్కపల్లి యాదగిరి, ప్రముఖ కవి కొండిమల్ల మల్లారెడ్డి, జీడిపల్లి రామచంద్రరావ్, మహ్మద్ పాషా, ఆదిలాబాద్ కవులు బొల్లారం బాబన్న, అంపెల్లి లక్ష్మీనారాయణ, రవికాంత్ జాదవ్ పాల్గొన్నారు.



గిరిజన విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కొండపై గల రత్నాపూర్ గిరిజన విద్యార్థులకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ప్రత్యేక అధికారిగా పనిచేస్తున్న కాడె స్వామి శనివారం స్వెటర్లు, బ్యాగులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న జగిత్యాల ఎమ్మార్వో విశ్వంబర్, మండల విద్యాధికారి వెంకట్రావు మాట్లాడుతూ దాత కాడె స్వామి గత మూడు సంవత్సరాల నుండి తన సొంత డబ్బుతో గిరిజన గ్రామాల్లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బ్యాగులు, స్వెటర్లు, వృద్ధులకు దుప్పట్లు అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాలు తనకెంతో ఆనందాన్నిస్తాయని కాడె స్వామి పేర్కొన్నారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని గిరిజన విద్యార్థులతో న్నారు. గిరిజన ప్రాంతంలో రోడ్లు, వంతెనలు, నీటి సమస్యలు ఉన్నందున చదువులకు కొంత ఇబ్బంది కలిగే అవకాశం ఉందన్నారు. రోడ్ల సక్రమంగా ఉన్నట్లయితే 108 వాహనాలు, ఇతర గ్రామాలకు వెళ్ళిందుకు సౌకర్య వంతంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల తుడుం దెబ్బ నాయకులు జ్ఞానేశ్వర్, మండల బీసీ నాయకుడు మేకల రవికాంత్, మాల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు నేతుల గంగన్న, ఉపాధ్యాయుడు ధన్‌రాజ్, గ్రామస్తులు మేశ్రం నాగోరావు, పెందూర్ ప్రసాద్, కోసేరావు, సూర్యభాన్, మాధవరావు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి శూన్యం



నవతెలంగాణ-ఖానాపూర్

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి సంవత్సర కాలం గడుస్తున్నా మండలంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడం బాధాకరమని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాళ్లపల్లి రాజగంగన్న అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి సీతక్క బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను మాత్రమే ప్రారంభించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. సంవత్సరం నుండి ప్రజా సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ప్రజలకు అంకితం ఇచ్చామని, కాంగ్రెస్ చేసిన మోసం శిలాఫలకాలకు పరిమితమని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు, ప్యాక్స్ వైస్ చైర్మన్ కరిపి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్ కలీల్, సీనియర్ నాయకులు పుప్పాల గజేందర్, శనిగారపు శ్రవణ్, కొక్కుల ప్రదీప్, కారింగుల సుమన్, మేహరాజ్, నసీర్, ఇర్ఫాన్, సంద రాకేష్, మైహిపాల్, లాజర్, వంశీ, షఫీ, సాయి పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో నిర్మల్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఆదిలాబాద్ ఎన్‌సీసీ 32వ బెటాలియన్ పరిధిలో ఇటీవల నిర్వహించిన వార్షిక శిక్షణ శిబిరంలో నిర్మల్ పట్టణంలోని కస్తూర్బా ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పథకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు టీ. వాణి, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి, ఫస్ట్ ఆఫీసర్ యాటకారి సాయన్న తెలిపారు. క్యాంపు ద్వారా పిల్లలకు శారీరక, మానసికంగా దృఢత్వం, నాయకత్వ లక్షణాలు, సేవా దృక్పథం పెరుగుపడుతుందని సాయన్న తెలిపారు. 10 రోజుల క్యాంపులో భాగంగా నిర్వహించిన డ్రిల్ ఫిజికల్ శిక్షణ, సాంస్కృతిక కార్యక్రమంలో పాఠశాలకు చెందిన బి.అక్షిత మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం, ద్వితీయ స్థానంలో నిలిచిన అలేఖ్య, అమూల్య సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్టిఫికెట్ల ప్రధానం చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు, ఎన్‌సీసీ అధికారి, ఉపాధ్యాయులు విద్యార్థులను ఘనంగా సన్మానించారు.

దుబ్బగూడ రోడ్డుకు సీతక్క భూమిపూజ

ఇంద్రవెల్లి : మండలంలోని శంకర్‌గూడ నుంచి దుబ్బగూడ గ్రామం వరకు ఒకటిన్నర కిలోమీటర్ల రోడ్డుకు శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క భూమిపూజ చేశారు. రూ.కోటీనాలుగు లక్షలతో ఈ రోడ్డును నిర్మించనున్నారు. కార్యక్రమంలో ఈఈ నిరంజన్, ముఖాడే ఉత్తం పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వాహనం దగ్ధం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

షార్ట్ సర్క్యూట్‌తో రన్నింగ్ బైక్‌లో మంటలు చెలరేగి వాహనం దగ్ధమైన సంఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే పట్టణంలోని రవీంద్రనగర్ కాలనీకి చెందిన విజయ్ తన ప్యాషన్ ప్రో బైక్ (ఏపీ01ఏఈ2078)ను శనివారం సర్వీసింగ్ చేసుకొని తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎన్టీఆర్ చౌరస్తాలో వాహనం నుంచి మంటలు చెలరేగడం గమనించి వాహనాన్ని అక్కడే పక్కకు ఆపేశాడు. అగ్నిమాక శాఖ కార్యాలయం ఎదుట బైక్ దగ్ధం అవుతుండడంతో వెంటనే వారు స్పందించి మంటలను ఆర్పేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. అసలేం జరుగుతుందని తెలుసుకునేలోపలే వాహనం మంటల్లో దగ్ధమైంది.

సీఐటీయూ కన్వీనర్‌గా దాగం రాజారాం

తాండూర్ : తాండూర్ ఐబిలోని భగత్‌సింగ్ భవన్‌లో మండల సిఐటియు అనుబంధ సంఘాల సమావేశం తిరుమలేశ్వరి అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో నూతన సిఐటియు మండల కన్వీనింగ్ కమిటీ కన్వీనర్‌గా దాగం రాజారాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో భవిష్యత్తులో చేపట్టే కార్యాచరణ చర్చించారు. కన్వీనింగ్ కమిటీలో సునీత, కవిత, సునీత, సత్యవతి, విజయలక్ష్మి, లక్ష్మి, లీలారాణి, మగ్దూం, రజిత, శారద, బాల భారతి, సరిత, దుర్గం నానయ్య, వేల్పుల శంకర్, గడ్డల హనుమక్క, ఇందారపు తార, రెడ్డి మల్లక్క, శారద ఉన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలు

- హాజరైన 33 జిల్లాల టీమ్స్, విద్యార్థులు
- ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాలు శనివారం టీటీడీసీలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వీటిని జేవీవీ గౌరవ అధ్యక్షుడు, నిమ్స్ మాజీ డైరెక్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహిత డాక్టర్ దాసరి ప్రసాద్ ప్రారంభించారు. ఇవి మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సైన్స్‌తో పాటు జన విజ్ఞాన వేదిక చేస్తున్న పనులను విద్యార్థులకు వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నారు. దీనికి 33 జిల్లాల నుండి 132 టీములు, 396 మంది విద్యార్థులు, 132 గైడ్ టీచర్లు హాజరయ్యారు. ప్రఖ్యాత శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, మేధావులు, అధికారులు జిల్లాకు వచ్చారు. మూడు రోజులు జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రాత పరీక్ష, ఆక్టివిటి రౌండ్, క్విజ్, విజువల్ రౌండ్, క్రియేటివ్ రౌండ్, సైన్స్ ప్రయోగాలపై పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముఖి సైన్స్ సంబరాల్లో ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేశారు. ఆయా జిల్లాల నుండి వచ్చిన పలువురు విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రయోగాత్మక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సైన్స్ అంటే నిరూపితమయ్యే ప్రదర్శనలు చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపారు

సైన్స్‌పై అవగాహన పెంచడానికి కృషి

విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన పెంచడం కోసం కృషి చేస్తున్నామని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, నిమ్స్ మాజీ డైరెక్టర్ దాసరి ప్రసాద్ అన్నారు. జేవీవీ రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాలను ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా పెద్ద ఎత్తున సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తయారు చేయడానికి ఎగ్జిబిట్స్ ఆలోచింపజేస్తున్నాయన్నారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో విద్యార్థులు నేర్చుకున్న వాటిని ఇతరులకు కూడా తెలియజేయాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజేశ్వర్ మాట్లాడుతూ ఆకాశ దర్శనం, సైన్స్ ఎగ్జిబిషన్, మిరాకిల్ ఎక్స్‌ప్లోజర్, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్ మ్యాజిక్, సైన్స్ గేములు, చరిత్ర గతినిమార్చిన శాస్త్రవేత్తల ఎగ్జిబిషన్, ఫీల్డ్ ట్రిప్, పుస్తక ప్రదర్శన, సైన్స్ కార్నివాల్ (స్ట్రీట్ సైన్స్ షో), ఇస్రో ఎగ్జిబిషన్లు అదనపు ఆకర్షణలుగా ఉంటాయని తెలియజేశారు.

భవిష్యత్ కోసం సైన్స్ ఎంతో ఉపయోగం : రాథోడ్ జైసింగ్

ప్రజల కోసం సైన్స్, భవిష్యత్ కోసం సైన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. తాను మూఢనమ్మకాలను నమ్మనని, సైన్స్ అభివృద్ధి కోసం ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. మూఢనమ్మకాలు గ్రామాల్లో ప్రజలు ఎక్కువ నమ్ముతారని, కొందరు ప్రాణాల మీదకు సైతం తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు తోటి వారికి, బంధువులకు సైన్స్ ప్రాముఖ్యతను తెలియజేయలన్నారు. ఒక పాజిటివ్ ఆలోచనతో ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సైంటిస్ట్ రాధ, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రాజు, బీఎస్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రవీందర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాకాంత్, పెంటపర్తి ఊశన్న, సంతోష్ పాల్గొన్నారు.







సమస్యలపై పోరాటం..పరిష్కారానికి ఆరాటం..!

- ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరు
- టీఎస్‌యూటీఎఫ్ సాధించిన విజయాలు అనేకం
- నేడు ఆదిలాబాద్ జిల్లా సంఘం 6వ జిల్లా మహాసభలు
- విజయవంతం చేయాలని జిల్లా కమిటీ పిలుపు

ఉపాధ్యాయులకు వెన్నుదన్నుగా ఉంటూ..వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడటంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్)ది కీలకపాత్ర. ఉపాధ్యాయులకు సమస్య వచ్చిన వెంటనే స్పందించి వారికి అండగా నిలవడంలో ముందు వరుసలో నిలుస్తోంది. ఉపాధ్యాయులే కాకుండా.. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసమూ అనేక పోరాటాలు చేపట్టింది. సర్కారు బడుల బలోపేతం కోసం ప్రభుత్వానికి.. అధికారులు, పాలకులకు ప్రాతినిధ్యం చేయడమే కాకుండా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక చర్యలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతోంది. పలు సామాజిక కార్యక్రమాల్లోనూ సంఘం ప్రాతినిధ్యం ఉంటుంది. ఆదిలాబాద్ జిల్లాలో ఐదు మహాసభలు పూర్తి చేసుకొని ఆదివారం డా.బీ.ఆర్.అంబేడ్కర్ భవనంలో నిర్వహించే ఆరో మహాసభలకు సిద్ధమైంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీఎస్‌యూటీఎఫ్ కీలకపాత్ర పోషిస్తోంది. ఉపాధ్యాయులకు సమస్య వచ్చిన వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి పోరాటం చేయడమే కాకుండా.. అధికారులకు ప్రాతినిధ్యం చేస్తూ వారికి అండగా నిలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి దక్కాల్సిన ప్రయోజనాల కోసమూ అలుపెరగని పోరాటం సాగిస్తోంది. ఉపాధ్యాయులతో పాటు విద్యారంగంలోనూ మౌళిక వసతులు కల్పించాలని పోరాటం సాగించింది. సామాజిక బాధ్యతలు నిర్వర్తించడంలోనూ సంఘం ముందు వరుసలో నిలుస్తోంది. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సందర్భంగా సంఘం కార్యాలయంలో ఉచిత ఆన్‌లైన్ సర్వీసు సెంటర్‌ను ఏర్పాటుచేసింది. వందలాది మంది ఉపాధ్యాయులు ఈ సేవలను వినియోగించుకున్నారు.

సంఘం చేపట్టిన పోరాటాలు..!

ఉపాధ్యాయుల పక్షాన టీఎస్‌యూటీఎఫ్ అనేక పోరాటాలు సాగించింది. ఈ మూడేండ్ల కాలంలో చేపట్టిన పోరాటాల్లో అనేకం మైలురాయిగా నిలిచిపోయాయి. 317 బాధితులకు న్యాయం చేయాలని డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడంతో పాటు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, కేజీబీవీ, యూఆర్ఎస్, గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేపట్టింది. వీటితో పాటు డిల్లీ కేంద్రంగా సాగిన రెజర్ల పోరాటానికి మద్దతుగా 2కే రన్ నిర్వహించడం, సీపీఎస్, ఎన్ఈపీలను రద్దు చేయాలని, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీ షెడ్యూల్ విడుదల చేయాలని, గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతుగా నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టింది. డీఎస్సీ 2024లో జరిగిన తప్పిదాలు, అవకతవకలపై పోరాటం చేయడంతో పాటు అన్యాయం జరిగిన అభ్యర్థులకు న్యాయం జరిగేలా కృషి చేసింది. సంఘం పోరాట ఫలితంగా 11మందికి ఉద్యోగాలు వచ్చాయి.



విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ధర్నా(ఫైల్)

సంఘం చేసిన ప్రాతినిధ్యాలు..!

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడమే కాకుండా ప్రభుత్వానికి, అధికారులకు పలు ప్రాతినిధ్యాలు చేసింది. బదిలీలు,పదోన్నతుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఈఓకు వినతిపత్రం అందించడంతో పాటు సప్లిమెంటరీ బిల్లులు ఖాతాల్లో జమ కాని ఉపాధ్యాయుల ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్‌లో చూపించే అవసరం లేకుండా మినహాయింపునివ్వాలని ట్రెజరీ డీడీకి విన్నవించింది. ఎస్ఎస్‌సీ స్పాట్‌లో పాల్గొన్న ఉపాధ్యాయుల రెమ్యూనరేషన్ పెంచాలని, పోలింగ్ కేంద్రాల్లో కూలర్లు ఏర్పాటుచేయాలని, మెడికల్ గ్రౌండ్‌లో విధులు నిర్వర్తించలేని వారికి మినహాయింపునివ్వాలని జిల్లా కలెక్టర్‌కు ప్రాతినిధ్యం చేసింది. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో అవసరం మేరకు విద్యావాలంటీర్లను నియమించాలని, డీఎస్సీ-2024లో జరిగిన తప్పిదాలు, అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించింది. ఇలా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ ఎనలేని కృషి చేసింది.


సంఘం కార్యాయంలో ఉపాధాయుల ప్రమోషన్స్ అప్షన్స్ ప్రక్రియ

విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా కృషి : వరగంటి అశోక్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ సంఘం ఎల్లవేళలా ముందుంటుంది. దీంతో పాటు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం పాటుపడుతుంది. ఉపాధ్యాయులకు జరిగిన అన్యాయాలపై అధికారులను ప్రశ్నించడమే కాకుండా ఉపాధ్యాయులకు న్యాయం జరిగే వరకు పోరాడుతూ వెన్నంటి ఉంటుంది. విద్యారంగ పటిష్టత కోసం అధికారులు ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా వాటిని స్వాగతిస్తుంది. రానున్న రోజుల్లోనూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తుంది. జిల్లా మహాసభలకు ఉపాధ్యాయులు, విద్యారంగ అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలి.

విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి : మంత్రి సీతక్క

ఖానాపూర్ : విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం పట్టణంలోని బాలుర ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జీలు 40, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచిందన్నారు. విద్యార్థులకు ప్రతిరోజు మంచి భోజనాన్ని అందించాలని, ఎవరైన అధికారులు కాంట్రాక్టర్లు డబ్బులకు ఆశపడి సరిగ్గా భోజనం పెట్టకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటి భోజనం లాగా విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం భోజనం చేస్తూ పాఠశాల, హాస్టల్‌లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్, మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, మండల అధ్యక్షులు ధోనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా పాల్గొన్నారు.

ఉట్నూర్ : గురుకుల, ఆశ్రమ పాఠశాలలో శనివారం నుండి కొత్త మెనూను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని జిల్లా క్రీడ అధికారి పార్థసారథి అన్నారు. మండలంలోని లాల్‌టెక్డి గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురుకుల పాఠశాల, ఆశ్రమ పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలో వందలాది మంది విద్యార్థులు చదువుతున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే మెనూ ప్రకారం విద్యార్థులకు వార్డెన్లు నాలుగు సార్లు మాంసాహారాన్ని వడ్డించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హరీరాం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో శనివారం సీడీపీఓ శారద కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. రాష్ట్ర, మండల స్థాయి సీఎం కప్ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జాదవ్ విఠల్, పాఠశాల సిబ్బంది పవార్ వనిత, ఆడే విశ్వనాథ్, నిలయ, రాజేశ్వర్, శంకర్, సూరజ్ సింగ్, పండిత్ సింగ్, గంగ, రాజ్యలక్ష్మి, విజయ పాల్గొన్నారు.

తాంసి : ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు శనివారం నూతన కామన్ డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపును తాంసి, భీంపూర్ మండలాల్లో ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మండల ప్రత్యేక అధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీవోలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 సంవత్సరాల నుండి విద్యార్థులకు ఎటువంటి మెస్ చార్జీలు పెంచకపోవడంతో పౌష్టికాహారం సరఫరా కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు చదువుతోపాటు మంచి ఆహారాన్ని అందించి వారి ఆరోగ్యం కాపాడుకోవాలని ఉద్దేశంతో మెనూ, కాస్మోటిక్ చార్జీలు పెంచడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ నలందప్రియ, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ప్రత్యేక అధికారి రవీందర్, వార్డెన్‌లు హరీష్, సురేందర్, హెచ్ఎం సంతోష్ పాల్గొన్నారు.



ఎస్సీ హాస్టళ్లను సందర్శించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-లోకేశ్వరం



మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టళ్లను అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచినందున విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. 15 రోజులకు ఒకసారి తహసీల్దార్ హాస్టళ్లను ఆకస్మికంగా సందర్శిస్తారని, ఆహారంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆహారంలో నాణ్యత ప్రమాణాలను పరిశీలించిన తర్వాతనే విద్యార్థులకు వడ్డించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్కా మోతీరాం, ఎస్ఐ అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

సోనాల వాసికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్

నవతెలంగాణ-బోథ్




మండలంలోని సొనాల గ్రామానికి చెందిన ఎర్ల.గంగారాం లక్ష్మి దంపతుల కుమార్తె ఎర్ల భాగ్యలక్ష్మి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. ఎర్ల భాగ్యలక్ష్మి ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామం సోనాలలోని ఉషోదయ పాఠశాల, నిర్మల్‌లోని చాణక్య కళాశాలలో డిగ్రీ, హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో పీజీ పూర్తి చేశారు. అలాగే సెట్, నెట్, అర్హత సాధించి పీహెచ్‌డీ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పూర్తి చేసి ఆదిలాబాద్ జిల్లా కథలు పరిశీలన అనే అంశంపై ఆచార్య విజయ లక్ష్మీ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎర్ల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పరిశోధనకు సహకరించిన ఆచార్యులకు ఆదిలాబాద్ జిల్లా రచయితలకు, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

నాణ్యమైన భోజనం కోసమే డైట్ చార్జీల పెంపు



ఆదిలాబాద్‌టౌన్ : విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఏఎస్పీ సురేందర్ రావు



నిర్మల్‌టౌన్ : కామన్ డైట్ చార్ట్‌ను ప్రారంభిస్తున్న ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వసతి గృహంలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పౌష్టికాహారం అందించేందుకు డైట్, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని ఏఎస్పీ సురేందర్ రావు అన్నారు. శనివారం డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. జిల్లాలోని వసతి గృహాల్లో ఈ కార్యక్రమానికి అధికారులు పాల్గొని విద్యార్థులతో కలిసి భోజనం చేసి ప్రారంభించారు. కాగా కోలాం ఆశ్రమ పాఠశాలలో కార్యక్రమ లాంచింగ్‌లో ఏఎస్పీ సురేందర్ రావ్ పాల్గొన్నారు. ముందుగా ప్రభుత్వం నుంచి వచ్చిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రాసెస్ పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను ఆహ్వానించి మెనూ గురించి వివరించారు. అనంతరం ఏఎస్పీ సురేందర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల డైట్ వల్ల కలిగిన అనార్థనాలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. సరైన ఆహారం అందడం లేదని తెలుసుకున్న ప్రభుత్వం కొత్త డైట్‌ను అమలు చేసిందన్నారు. గతంలో ఇచ్చే డైట్ విద్యార్థులకు సరిపోవడం లేదని, వారి ఎదుగుదలకు కూడా సహకరించడం లేదని తెలుసుకుందన్నారు. అందుకే గతంలో ఉన్న డైట్ కంటే 40 శాతం పెంచి ఇస్తుందన్నారు. అదే విధంగా ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. దీనికి గాను ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచిందన్నారు. వసతి గృహంలోని విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుంటు చదువులతో పాటు ఇతర అంశాల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల హెచ్ఎం నారాయణ రావు, ఉపాధ్యాయులు సురేందర్, ప్రభాకర్, హరిదాస్, భూజంగ్ రావు, విలాస్, రమేష్, వార్డెన్ ప్రభాకర్ ఉన్నారు.

నిర్మల్ టౌన్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆహారపు మెనూ విద్యార్థులకు వరమని అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన ఆహార మెనూ కార్యక్రమాన్ని సోఫీ నగర్ ప్రభుత్వ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం నూతన ఆహార మెనూతో విద్యార్థులకు పుష్టికరమైన ఆహారాన్ని అందిస్తుందన్నారు. విద్యార్థులు చక్కటి భోజనం చేసి, ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ, చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డానియల్, సీఐ ప్రభాకర్ రెడ్డి, పరీక్షల సహాయ కమిషనర్ పద్మ విద్యాశాఖ పర్యవేక్షకులు వెంకటరమణ, విద్యాశాఖ సమన్వయకర్తలు రాజేశ్వర్, నర్సయ్య, సలోమి కరుణ, ప్రవీణ్ కుమార్, లింబాద్రి, జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలోని స్వర్ణ ఆశ్రమ పాఠశాలలో శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హది అధికారులతో కలసి డైట్ చార్జీలు పెంచిన నూతన మెనూను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు 40శాతం డైట్ చార్జీలు పెంచిందన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీ కాంతారావు, ఎస్సై శ్రీకాంత్, పాఠశాల హెచ్ఎం సంగీత రాణి, హెచ్‌డబ్ల్యూఓ రాథోడ్ మంగిలాల్, రాజ్ కుమార్, పిల్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మావల మండలం కేంద్రంలోని డైట్ కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని సివిల్ సప్లయ్ డీఎం సుధారాణి, ఎంపీడీఓ శంకర్ తెలిపారు. బాలబాలికలకు 40 శాతం డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుపై శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ గంగాదేవి, రేఖ, విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్ : మండలంలోని గురుకుల కళాశాలను శనివారం అదనపు శ్యామల దేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం హాస్టల్లో గురుకులాలు వివిధ సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల కోసం నాణ్యమైన భోజనాన్ని అందించడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రభుత్వపరంగా నూతనంగా ఇటీవల విడుదల చేసిన డైట్ మెనూ చార్ట్‌ను ఆమె చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వాజీద్‌అలీ, ఎంపీడీఓ రమేష్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు ప్రభాకర్, ప్రిన్సిపాల్ సంగీత, వైస్ ప్రిన్సిపల్ లత, జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ మాధవి, లెక్చరర్ రవికుమార్, సూపరింటెండెంట్ అర్చన, అకౌంటెంట్ చరణ్ పాల్గొన్నారు.



సారంగపూర్



ఆదిలాబాద్ రూరల్



బోథ్

అందరి సహకారంతో రాజీపడ్డదగ్గ కేసుల పరిష్కారం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లోక్ అదాలత్‌లో రాజీపడ్డదగ్గ కేసుల పరిష్కారంలో ప్రతి ఒక్కరి సహకారం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావ్ అన్నారు. శనివారం డీఎల్ఎస్ఏ కార్యాలయం సమావేశ మందిరంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. రాజీమార్గం ద్వారా కక్షిదారుల మధ్య కేసులను పరిష్కరించి వారికి రాజీ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలిసో తెలియకో తప్పులు చేసి కేసుల్లో ఇరుక్కొని కోర్టుల చుట్టూ కక్షిదారులు తిరుగతున్నారని దీని కారణంగా కోర్టుల్లో కేసుల సంఖ్య పెరిగిపోతుందన్నారు. వీటిని తగ్గించేందుకు గాను డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో లోక్‌అదాలత్‌లను నిర్వహిస్తు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కారిస్తున్నామన్నారు. జిల్లాలో రాజీపడదగ కేసుల పరిష్కారంలో ఇక్కడి అధికారులు, పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు అందిస్తున్న సహకారం మరవలేనిదన్నారు. భవిష్యత్తులో కూడా ఇలానే కేసుల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. అన్ని బార్ అసోసియేషన్‌ల కంటే ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు భేష్ అని అభివర్ణించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శివరాంప్రసాద్, దుర్గారాణి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, ఏఎస్పీ సురేందర్ రావ్ కక్షిదారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-భైంసా

రెండు నెలల నుండి భైంసా మండలంలోని దేగాం గ్రామంలో వేర్వేరు కారణాలతో పది మందికిపైగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అదే విధంగా వేర్వేరు కారణాలతో మృతి చెందిన 12 మంది బాదిత కుటుంబాలను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పరామర్శించారు. పేద కుటుంబాలు కావడంతో ఇంటింటికి వెళ్లి వారిలో మనోధైర్యాన్ని నింపి, నేనున్నానని భరోసా కల్పించారు. ఆత్మహత్యలకు కారణాలేంటో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వపరంగా ఇందిరమ్మ ఇల్లు, పింఛన్లు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. పేద కుటుంబాలకు పరామర్శించి, భరోసా కల్పించడం పట్ల గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు ఎమ్మెల్యే పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబాలకు ఎమ్మెల్యే పటేల్ తన వంతుగా సాయాన్ని అందించారు. పరామర్శించిన వారిలో ఎమ్మెల్యే వెంట బీజేపీ నియోజకవర్గ నాయకులు సొలంకి భీంరావ్, కుంటాల మండల నాయకులు వెంగల్ రావ్, జిల్లా సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ సిరం సుష్మ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఎల్లప్ప, నాయకులు కిష్టన్న, చంద్రకాంత్ పటేల్, భోజరాం పటేల్, పోల్కం సాయి, రాము, గంగాధర్, గణపతి, పోతయ్య రవి, గంగారాం, శారదా పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో సామాగ్రి దగ్ధం



నవతెలంగాణ-తాంసి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శనివారం లీంగూడ గ్రామంలో ఇంట్లో సామాగ్రి దగ్ధమైన సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే లింగూడా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తొడసం శంభుకు చెందిన ఇంట్లో ఉదయం 8 గంటల సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులంతా భయపడి బయటకు పరుగులు తీశారు. చుట్టుపక్కల వారితో కలిసి మంటలార్పారు. దాదాపు రూ.1లక్ష వరకు నష్టం జరిగినట్లు బాదితుడు తెలిపారు. ఉదయం పూట జరగడంతో అందరూ కలిసి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం జరగలేదు. కాగా విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ తాటిపెల్లి రాజు బాధితుడు మాజీ సర్పంచ్ తొడసం శంభును పరామర్శించారు. కుటుంబానికి తన వంతు సాయంగా రూ.5 వేలు అందజేశారు. ఆయన వెంట నాయకులు అరుణ్, గజానన్, సదానందం, కృష్ణ ఉన్నారు.

గ్రూప్-2 పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రూప్-2 పరీక్ష నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గౌష్ ఆలం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 15, 16న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రూప్ 2 పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 29 సెంటర్లలో 10428 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష సజావుగా జరిగేందుకు పోలీస్ శాఖ తరపున పూర్తి ఏర్పాట్లు చేసిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం పేర్కొన్నారు. 300 మంది పోలీస్ సిబ్బందితో పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఐదు రూట్లలో సీఐ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా ఉంటూ, ఎస్ఐ స్థాయి అధికారి ద్వారా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తారన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద డిఎఫ్ఎండి, హెచ్‌హెచ్ఎండీలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించడం జరుగుతుందన్నారు. మహిళ అభ్యర్థులకు ప్రత్యేకంగా మహిళా సిబ్బంది ద్వారా తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యల లేకుండా ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ద్వారా బందోబస్తు చర్యలను చేపడుతున్నామన్నారు. పట్టణంలో అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలకు సంబంధించిన సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి అత్యవసరం సమయంలోనైనా అభ్యర్థులు 100 ద్వారా పోలీసు యంత్రాంగం సేవలను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. పరీక్షా పత్రాల మరియు జవాబు పత్రాల తరలింపులో ప్రత్యేక పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి పకడ్బందీగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాలకు విద్యార్థులు



నవతెలంగాణ-లోకేశ్వరం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో మండల, జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయికి మండలంలోని రాజుర జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు ఎంకయ్యారు. ఆదిలాబాద్ శనివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాల్లో పాఠశాల నుంచి ఎంపికైన విద్యార్థులు 10వ తరగతి నుంచి సాయి తేజ, 9వ తరగతి నుంచి అమన్, 8వ తరగతి నుంచి అయేషా పాల్గొంటారని గైడ్ టీచర్ చంద్ర శేఖర్ తెలిపారు.

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన మంత్రి

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని ఆశ్రమ పాఠశాలను శనివారం రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ(సీతక్క), ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. వసతులు, మెనూ తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఆరా తీస్తు బోధన తీరును అడిగారు. మంత్రి వెంట టీపీసీసీ జనరల్ సెక్రటరీ సత్తు మల్లేష్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులున్నారు.

గిరి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఉట్నూర్



గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. శనివారం మండలంలోని శంభుగూడ నుండి శివ్‌నూర్ గ్రామం వరకు రూ.3 కోట్ల 24 లక్షలతో బీటీ రోడ్డు, లక్కారం నుండి చింతగూడ వరకు రూ.8 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం పనులకు ఎమ్మెల్యే బోజ్జుపటేల్‌తో కలిసి మంత్రి సీతక్క, శంకుస్థాపన చేశారు. అనంతరం శ్యామ్‌పూర్ గ్రామంలో రూ.12 లక్షలతో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి, కోళ్ల ఫామ్, చెక్‌డ్యాం, 124 స్వయం సహాయక సంఘాలకు రూ. 7 కోట్ల 59 లక్షల బ్యాంక్ లింకేజి చెక్కు, ఐటీడీఏ ఆధ్వర్యంలో పేస్-1 ట్రైకార్ సబ్సిడీ రూ.7.5 లక్షలను ఇంద్రవెల్లి ఎఫ్‌పీఓకి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రజలు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ ఖుష్భూ గుప్తా, ఎస్పీ గౌస్ ఆలం, ఎమ్మెల్సీ దండే విఠల్, కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి సుగుణ, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహా నినాదం పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క

ఉట్నూర్ సాహితీ వేదిక కవి జాదవ్ మురళి రచించిన మహా నినాదం పుస్తకాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) ఎమ్మెల్యే వెడ్మ బోజుజ పటేల్, కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి సుగుణతో కలిసి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ మహా నినాదం పుస్తకం చాలా బాగుందని, కవులు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్షులు బంకట్ లాల్, మాజీ అధ్యక్షులు శ్రావణ్ రాథోడ్, కోశాధికారి జాదవ్ ఇందల్ సింగ్, ప్రచారకార్యదర్శి ఆత్రం మోతిరాం పాల్గొన్నారు.

బస్సు జాత సభను జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్
- ఆశాల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్త బస్సుజాత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో డిసెంబర్ 15న నిర్వహించే ఆశాల రాష్ట్ర బస్సుజాత సభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ కోరారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఆశాలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ ఫిబ్రవరిలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాల సమస్యలపైన చర్చలు జరిపి పరిష్కారం కోసం ప్రణాళిక రూపొందించాలని, ఆశాలకు కనీస వేతనం రూ. 18వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలనే ప్రధాన డిమాండ్లతో బస్సు జాతను నిర్మల్ నుంచి ప్రారంభమై మధ్యాహ్నం ఆదిలాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలతో వెట్టి చాకిరి చేయిస్తుందన్నారు. ప్రాణాంతకమైన టీబీ స్ఫూటమి డబ్బాలను మోహిస్తున్నారని ఈ పనిని వెంటనే రద్దు చేయాలన్నారు. పారితోషికం లేని పనులను ఆశాలతో చేయించొద్దని, పెండింగ్‌లో ఉన్న సర్వేల బిల్లులను వెంటనే ఆశాల ఖాతాలో జమ చేయాలన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను మేనిఫెస్టోలో ఆశలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఆశాల బస్సు జాత సందర్భంగా నిర్వహించే సభలో జిల్లాలోని ఆశాలందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.సుజాత, నాయకులు ఆశ, శాంత, పద్మ, లక్ష్మీ, పుష్ప, శిరీష పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని గొట్టి పటార్ గ్రామంలో ఆర్మీ జవాన్ వాఘ్మారే వినోద్ కుమార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. జవాన్ మృతి అనంతరం కుటుంబీకులు విగ్రహం ఏర్పాటు చేశారు. శనివారం విగ్రహం కుడి చేతిని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. దేశ రక్షణ కోసం ప్రాణాలిచ్చిన సైనికునిడి విగ్రహాన్ని అగౌరవ పరిచారని అన్నారు. అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

5వ రోజు సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



సమగ్రశిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిర్మల్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 5వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా కాంటాక్ట్ ఉద్యోగ ఉపాధ్యాయులు మోకాళ్లపై నిల్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న డిమాండ్లను పరిష్కరించడంలో జాప్యం చేస్తుందని మండిపడ్డారు.

తల్లితో సమ్మెలో చిన్నారి

ప్రతిరోజు ప్రభుత్వానికి వినూత్న రీతిలో తమ నిరసనను ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. దీక్ష శిబిరానికి తమ పిల్లలతో వచ్చి నిరసన తెలుపుతున్నారు.

గురుకుల అతిథులకు ఎంటీఎస్ ఇవ్వాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గురుకులాల్లో పనిచేయుచున్న పార్ట్ టైం, గెస్ట్ అధ్యాపకులకు ఉపన్యాసకులకు, అన్ని గురుకులాల్లో ఒకేరకమైన వేతనాలు ఇప్పించాలనీ, ఎంటీఎస్ ప్రకారమే వేతనాలు ఇచ్చేలా కృషి చేయాలని ఎమ్మెల్యే కోవలక్ష్మికి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి అతి తక్కువ వేతనలతో గురుకులాలలో పని చేస్తున్నామన్నారు. రెగ్యులర్ అధ్యాపకులకు సమానంగా పని భారం ఉన్న వేతనాల్లో తేడా ఉందని దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది మెకార్తి కృష్ణ, దుర్గం శ్రీనివాస్, కోసరి మహేష్, కోంద్ర రాజేందర్, సునీల్, సంపత్, రమేష్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు సాధనకు ఉద్యమం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

కార్మికుల హక్కుల సాధనతో పాటు సంక్షేమ బోర్డు సాధనకు ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. శనివారం మండలంలోని వేంపల్లి గ్రామంలో తెలంగాణ ఆల్ రైస్‌మిల్ వర్కర్స్ ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రైస్ మిల్లులో పనిచేస్తున్న గుమస్తా, ఆపరేటర్, హమాలీ, డ్రైవర్లు ఇతర విభాగాల్లో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ.10 లక్షలు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా ప్రభుత్వమే గుర్తింపు కార్డులివ్వాలని, రూ.6000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 20న సిర్పూర్ అయ్యప్ప స్వామి గుడి పక్కన పాత రైస్ మిల్లు బంగ్లాలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించడం జరుగుతుందని, అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రైస్ మిల్ ఆపరేటర్ వగాడే సంజీవ్, గుమస్తా సాయినాథ్, హమాలీ డ్రైవర్లు, మహేష్, హర్షత్, సతీష్, అమర్ పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- అదనపు కలెక్టర్ దీపక్‌తివారి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 15, 16 తేదీలలో నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అదనపు కలెక్టర్ దీపక్‌తివారి తెలిపారు. శనివారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష కొనసాగుతుందని, పరీక్షా కేంద్రాలలో అవసరమైన ఫర్నీచర్, గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 15, 16 తేదీలలో రెండు రోజుల పాటు ఉదయం, మధ్యాహ్నం 2 పేపర్లు ఉంటాయని, అభ్యర్థులు పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

అనంతరం కాగజ్‌నగర్ పట్టణంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ దీపక్ తివారి సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో దరఖాస్తుదారుల వివరాలు నమోదు చేసే సమయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పొరపాట్లకు తావు లేకుండా చూడాలని సర్వే సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

వాంకిడి : మండలంలోని బంబారా గ్రామంలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలను శనివారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంట గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతిరోజు ఎంత సరుకులు కావాలో అంతే తీసుకొని శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సిబ్బందిని కోరారు. విద్యార్థులకు దుప్పట్లు అందించాలని, చలికాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన వెంట తహసీల్దార్ రియాజ్ హైమద్, పాఠశాల సిబ్బంది, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మీ-సేవ నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలకు నిరంతరం సేవలందించే మీసేవ నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని మీ సేవ నిర్వాహకుల సంఘం నూతన అధ్యక్షుడు గడ్డల సురేష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి తెలంగాణ మీసేవ ఫెడరేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరా శంకర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నుకున్నామన్నారు. మీసేవ నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వ సేవలు సులభంగా, వేగంగా, మధ్యవర్తిత్వం లేకుండ అనే నినాదంతో మీసేవ ప్రారంభమైందని, ప్రస్తుతం ప్రత్యేక అప్లికేషన్‌లతో ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా సేవలు అందించేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో మీసేవ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇంటర్‌నెట్ ద్వారా అందించే సేవలు మీసేవ ద్వారా మాత్రమే అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా గడ్డల సురేష్

తెలంగాణ మీసేవ ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో భాగంగా జిల్లా అధ్యక్షుడిగా గడ్డల సురేష్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, కిరణ్, కార్యదర్శిగా నరేష్, కోశాధికారిగా యాంసాని సంతోష్, సంయుక్త కోశాధికారిగా మతీన్, కార్యనిర్వాహక సభ్యునిగా రాకేష్, హన్మంతు, మొయినుద్దీన్, మీడియా ప్రతినిధిగా రవికాంత్‌లను ఎన్నుకున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని కృష్ణపెల్లి పెద్దవాగు సమీపంలో 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై కే.ప్రవీణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలం నుండి మహారాష్ట్రకు బొలేరో వాహనంలో 15 క్వింటాళ్ల పీడీఎస్ అక్రమంగా తరలిస్తున్నారు. సమాచారం మేరకు వాహనాన్ని తనిఖీ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు. పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఎండి నౌషాద్‌పై కేసు నమోదు చేశామని వివరించారు.

నష్టపరిహారం అందజేత

నవతెలంగాణ-కెరమెరి



నిషాని గ్రామానికి చెందిన రైతు పితాంబర్‌కు చెందిన అవుపై పులి దాడి చేసి హతమార్చింది. కాగా ఈ విషయంలో అటవీ శాఖ అధికారులు ప్రభుత్వం నుంచి మంజూరైన నష్టపరిహారాన్ని శనివారం అందించారు. ఎఫ్ఆర్ఓ మజారోద్దీన్ రూ.10 వేల చెక్కు, ఇతర ఎన్‌జీఓ వారు రూ.3వేలు మొత్తం 13వేలను పితాంబర్‌కు అందజేశారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఈటీ మృతికి సంతాపం


నవతెలంగాణ-ఆసిఫాబాద్

వరంగల్ రైల్వేస్టేషన్‌లో సైనిక్ గురుకుల పాఠశాల పీఈటీ మృతికి జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాల సిబ్బంది సంతాపం తెలుపుతూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఈటీ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇంట్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది వెంకటేష్, సంతోష్, చిన్నక్క, మహేందర్ పాల్గొన్నారు.

జోడేఘాట్‌కు పెరిగిన సందర్శకుల తాకిడి

ఆహ్లాదం, పచ్చదనం కోసం జోడే ఘాట్‌కు పర్యాటకుల తాకిడి పెరిగింది. జల్.. జంగల్.. జమీన్ నినాదంతో నిజాం సర్కార్‌తో పోరాటం సాగించి తూటాలకు నెలకొరిగిన కుమురం భీం ధీర భూమి జోడేఘాట్‌ను గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.25 కోట్లతో భీం స్మారక కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ పర్యటక కేంద్రాన్ని చూసేందుకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పర్యటకులు తరలి వస్తున్నారు. శనివారం రెండో శనివారం కావడం విద్యార్థులకు సెలవు దినం కావడంతో పదుల సంఖ్యలో ప్రత్యేక సర్వీసు బస్సుల్లో తరలి వచ్చారు. మంచిర్యాల జిల్లాలోని భీమిని, తాండూర్ మండలాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చారు. అయితే వారికి ఇక్కడ అసౌకర్యాలు స్వాగతం పలుకుతున్నాయి. నిత్యం సందర్శకులు వస్తున్న అధికారులు మాత్రం వీటి గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.


- కానరాని కాటేజీలు.. ఇబ్బందులు పడుతున్న సందర్శకులు



భీం స్మారక సమాధి వద్ద సందర్శకులు

నవతెలంగాణ-కెరమెరి

సహజసిద్ధమైన కొండలు, దట్టమైన అడవి, మలుపులు తిరిగే రహదారితో జోడేఘాట్ ప్రకృతి అందాన్ని సంతరించుకుంది. దీంతో ప్రకృతి ప్రేమికులు జోడేఘాట్ ప్రాంతాన్ని వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014 అక్టోబర్ 8న భీం వర్ధంతి సభలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొన్నారు. మ్యూజియం ఏర్పాటుకు రూ.25 కోట్లు మంజూరు చేశాం..ఇకనుంచి పర్యటకుల తాకిడి పెరుగుతుంది.. ఇక్కడ కాటేజీలు, హోటల్ నిర్మాణం చేపడతామని హామీలు ఇచ్చారు. తర్వాత కాలంలో భీం మ్యూజియం నిర్మాణం పూర్తి కావడంతో క్రమంగా ఈ ప్రాంతానికి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత జోడేఘాట్ అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో పర్యాటక కేంద్రంలో సౌకర్యాల కల్పన మరుగునపడ్డది. ప్రస్తుతం విద్యార్థులు విహార యాత్రలు చేసే సమయం కావడంతో ప్రస్తుతం జోడేఘాట్‌కు పర్యటకుల తాకిడి పెరిగింది.



వివిధ పాఠశాలల విద్యార్థులను పాఠశాల యజమానులు పిక్నిక్ కోసం ఇక్కడికి తీసుకు వస్తున్నాయి. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని చంద్రపూర్, రాజుర తదితర ప్రాంతాల నుంచి ప్రజలు ఎక్కువగా మ్యూజియం వద్దకు వస్తుంటారు. కానీ పర్యాటకులకు కనీస ఇక్కడ మినరల్ వాటర్ బాటిల్ కూడా దొరకడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్ సర్కారు దృష్టి సారిస్తే మేలు జరుగుతుందని గిరిజనులు ఆశ భావం వ్యక్తం చేస్తున్నారు

కానరాని కాటేజీలు

గత ప్రభుత్వం పర్యాటకుల సౌకర్యార్థం కాటేజీల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చిన ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టక పోగా మ్యూజియం నిర్మాణం పూర్తై 10 ఏండ్లు అయినా నేటికీ మౌలిక సదుపాయాల కల్పన కార్యరూపం దాల్చలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు సైతం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే సందర్శకుల కోసం విశ్రాంతి గదులు, క్యాంటిన్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. మ్యూజియం నిర్మాణం చేపట్టిన ఇతర వసతులు లేక పర్యటకులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోడేఘాట్‌పై దృష్టి సారించి ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శకుల సౌకార్యార్థం జోడేఘాట్‌లో వసతులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పర్యాటకులకు సౌకర్యాలు కల్పించాలి

పెందూర్ రాజేశ్వర్, భీం ఉత్సవ కమిటీ చైర్మన్

జోడేఘాట్‌లో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయడంతో ఆదివాసీ సమాజానికి గుర్తింపు లభించింది. మ్యూజియాన్ని చూసేందుకు విద్యార్థులు మన రాష్ట్రమే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో వస్తున్నారు. వందల సంఖ్యలో వస్తుండడంతో జోడేఘాట్ సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పర్యటకుల సౌకర్యార్థం విశ్రాంతి గదులు, క్యాంటిన్ ఏర్పాటు చేయాలి.





చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు

- ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శనివారం కాగజ్‌నగర్ మండలం గన్నారంలోని గిరిజన సంక్షేమ బాలికలు, మహాత్మాజ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ముందు కొత్తగా ప్రభుత్వం తీసుకువచ్చిన కామన్ డైట్ మెనూ ఛార్ట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని, విద్యార్థులు మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు, అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం డైట్ ఛార్జీలను పెంచడం అభినందనీయమే అయినా గురుకులాలలో మంచి ఆహారం అందించడంపై దృష్టి సారించాలన్నారు. గురుకుల పాఠశాలల అభివృద్ధి, అసంపూర్తి భవనాల విషయంలో తాను ప్రత్యేక చొరవ తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ రమ్య, వేణి, కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేందర్, మాజీ జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, మాజీ సర్పంచ్ దోతుల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మంగీలాల్, నాయకులు సామల తిరుపతి, శేఖర్, బాబూరావు, దిలీప్, భుజంగరావు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో సబ్ కలెక్టర్ సహపంక్తి భోజనం

కాగజ్‌నగర్ పట్టణంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలను శనివారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సందర్శించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. తరగతి గదులను, వంట గదిని ఆమె పరిశీలించారు. కూరగాయలు, బియ్యం నాణ్యతను పరిశీలించారు.

బలగల మైనార్టీ పాఠశాల సందర్శన

కాగజ్‌నగర్ మండలం బలగల మైనార్టీ గురుకుల పాఠశాల-2ను కాగజ్‌నగర్ డిప్యుటీ తహసీల్దార్ పి.సరిత శనివారం సందర్శించారు. పాఠశాలలోని స్టోర్ రూంతో పాటు వంటగదిని పరిశీలించారు. వంటగదిలో శుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. కొత్త యూనిఫాంతో పాటు మెనూ ఛార్ట్‌ను ఆవిష్కరించి, ఎస్‌ఓపీ హ్యాండ్ బుక్‌ను విడుదల చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. క్యాంపస్ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షగుఫ్తా, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని బూరుగుడ సమీపంలో హైవే రహదారి పక్కన నిర్మించిన ఆలయంలో మైసమ్మ విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్టు వివరించారు. ప్రత్యేక పూజలు అనంతరం నిర్వాహకులు అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు సత్యనారాయణ, గోపాల్, కమిటీ సభ్యులు విజయ్ గౌడ్, వెంకటేష్, రవికుమార్, శ్రీనివాస్, వెంకటేష్, సత్తయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ : డైట్ చాట్ బుక్‌ను రిలీజ్ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ

విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన కామన్ డైట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎస్పీ శ్రీనివాస్ రావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి డా. బీఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని, ఇందులో భాగంగా విద్యార్థులకు 8 సంవత్సరాల తర్వాత డైట్ చార్జీలు 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలు 200 శాతం పెంచిందని తెలిపారు. ప్రభుత్వం గురుకులాలు, వసతి గృహాలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్, ఆశ్రమ పాఠశాలలలో చదివే విద్యార్థులకు ఆరోగ్యకరమైన పోషక విలువలు కలిగిన మెనూ ప్రకటించిందని, ప్రతిరోజు వివిధ రకాలైన మెనూను సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 110 విద్యాసంస్థలలో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. కామన్ డైట్ చార్జీలు 3వ తరగతి నుండి 7వ తరగతి వరకు విద్యార్థులకు రూ.950 నుండి రూ.1,330 వరకు, 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు రూ.1,110 నుండి రూ.1,740 వరకు, ఇంటర్ విద్యార్థులకు రూ.1,500 నుండి రూ.2,100 వరకు పెంచడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం భారీగా పెంచడంతో పాటు విద్యా బోధన, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధనతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించిందని, విద్యాలయాలలో వంటగది, భోజనశాల, సౌచాలయాలు, మూత్రశాలల శుభ్రతపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వీటి నిర్వహణకు రాబోవు 3 నెలల పాటు వంట సిబ్బందికి, వార్డెన్‌లకు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. . అనంతరం విద్యార్థులు, పోషకులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల ఉపసంచాలకులు సజీవన్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కౌటాల : విద్యార్థుల విద్యాభివృద్ధికి కోసం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకొని వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచడం అభినందనీయమని తహసీల్దార్ ఇందారపు పుష్పలత అన్నారు. శనివారం మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల వసతి గృహంలో ప్రభుత్వం పెంచిన మెస్‌చార్జీల కార్యక్రమాన్ని ఎస్సై ఎన్ మధుకర్‌తో కలిసి ప్రారంభించారు. వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు వంట సిబ్బంది తమ పిల్లలుగా భావించి అన్నం పెట్టి విద్యార్థుల మన్ననలు పొందాలన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలోని బాలుర బీసీ హాస్టల్‌ను ఎంపీడీఓ వి.ప్రవీణ్‌కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వసతి గృహంలోని వంట గదిని, స్టాక్ గదిలోని సరుకుల నిల్వ, నాణ్యత, మరుగుదొడ్లను పరిశీలించారు. ప్రభుత్వం హాస్టల్ విద్యార్థిని, విద్యార్థులకు ఎనిమిది సంవత్సరాల తర్వాత ఇప్పుడు డైట్ చార్జీలను 40 శాతం పెంచిందని, ఎదుగుతున్న విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడమే లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట హాస్టల్ వార్డెన్, తల్లిదండ్రులు, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో శనివారం నూతన డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని తహసీల్దార్ భుమేశ్వర్ ప్రారంభించారు. విద్యార్థులకు నూతన డైట్ మెనూ అందించాలని ఆయన సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దీనకరణ్, పాఠశాల చైర్మన్ లక్ష్మి, వార్డెన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కౌటాల : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ కోట ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో నిర్వహించిన పెంచిన డైట్ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై హాస్టల్‌లోని వసతులను పరిశీలించి, ప్రభుత్వం భోజన వసతి కాస్మోటిక్స్ చార్జీలు ప్రభుత్వం పెంచిందన్నారు. అనంతరం యూనిఫాం డైట్, కిచెన్ స్టోరేజ్ ప్రొటోకాల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల విద్యాభ్యాసం పట్ల ఆసక్తి చూపాలన్నారు. తరువాత విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో చింతలమానేపల్లి ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

దహెగాం : విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకోవాలని ఎంపీడీఓ రాజేందర్, ఎస్సై రాజు అన్నారు. శనివారం మండలంలోని కల్వాడ గ్రామంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో ప్రభుత్వం పెంచిన నూతన మెనూను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి భోజనాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉద్దేశంతో నూతన మెనూని ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీఓ ఆల్బర్ట్ అన్నారు. శనివారం మండలంలోని ఎల్లూరు ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన కామన్ మెనూ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ కొమురయ్య, ఎఫ్ఆర్ఓ అనిల్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ ప్రతాప్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెరమెరి : వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పోషకాహారం అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఋషి చేస్తుందని జడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ అంజత్ పాషా అన్నారు. ప్రభుత్వం వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ, కాస్మోటిక్ ఛార్జీలను పెంచిన నేపథ్యంలో శనివారం హట్టి ఆశ్రమ, బాబేఝరి ఆశ్రమ పాఠశాలల్లో కొత్త మెనూ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పంచపూల, జంగు, పంచాయతీ కార్యదర్శులు సతీష్, జాడే పెంటూ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలం, ఆశ్రమ బాలికల, బాలురలో ప్రభుత్వం నూతనంగా పెంచిన డైట్ చార్జీలకు అనుకూలంగా నూతన డైట్ లాంచింగ్ మెనూ ఆవిష్కరణను మండల అధికారులు, తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా డీపీఆర్‌ఈపీఆర్ ప్రత్యేక అధికారి ప్రభాకర్ పాల్గొని నూతన మెనూను ప్రారంభించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. కార్యక్రమంలో జిల్లా గురుకులాల సమన్వయ అధికారి డి.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ బక్కయ్య, ఎంపీటీఓ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.



కౌటాల



పెంచికల్‌పేట్



దహెగాం

నవతెలంగాణ
మంచిర్యాల
4
ఆదివారం | డిసెంబర్ 15, 2024 | www.navatelangana.com

ఆస్పత్రి భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్‌దీపక్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీలైనంత తొందరగా పనులు పూర్తి చేయాలని సంబదింత అధికారులకు, గుత్తేదారులకు సూచించారు. ఆస్పత్రి ఏర్పాటుకు సంబందించిన అన్ని సమకూర్చాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణ పరిధిలోని జాతీయరహదారిపై ఆర్టీసీ బస్సు ఢీకొని ఇటిక్యాలకు చెందిన చుంచు లింగయ్య(62) మృతి చెందినట్టు ఎస్ఐ పి సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు శుక్రవారం తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై లక్షెట్టిపేట మార్కెట్‌కు వెళుతుండగా మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపు వస్తున్న బస్సు ఇటిక్యాల వద్ద వెనకనుండి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య చుంచు లక్ష్మీ పిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన బస్సును అదుపులోకి తీసుకొని బస్సు డ్రైవరు సంబోదు కొండయ్యపై కేసు నమోదు చేశామని తెలిపారు.

వసతిగృహాల్లో కొత్త మెనూ ప్రారంభం

నవతెలంగాణ-జన్నారం

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన న్యూ కామన్ డైట్ మెను కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో శనివారం అదనపు కలెక్టర్ సభావత్ మోతిలాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ 8 సంవత్సరాల నుంచి విద్యార్థులకు డైట్ మెనూ చార్జీలు పెంచలేదన్నారు. హాస్టల్లో చదువుతున్న విద్యార్థులు మంచి భోజనం అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. చికెన్ గుడ్లు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తామన్నారు. అలాగే ప్రభుత్వం విద్యార్థుల కోసం కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచిందన్నారు. హాస్టల్లో ఏర్పాటుచేసిన న్యూ డైట్ మెనూ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వంటశాలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంతి భోజనం చేశారు. అలాగే మండలంలోని కవ్వాల్ గ్రామంలో ఉన్న గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో రాష్ట్ర జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి, మండల కేంద్రంలోని ఆశ్రమ బాలుల పాఠశాలలో తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి, తపాలపుర్ గ్రామంలో ఉన్న ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్‌రావు న్యూ డైట్ కార్యక్రమాలను వేరువేరుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. హాస్టల్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి వినోద్ కుమార్, మండల ఎంఈఓ విజయ్ కుమార్, ఎంపీడీఓ శశితల, బీసీ హాస్టల్ వార్డెన్ రమేష్, తపా లాపూర్ ఎస్సీ హాస్టల్ వార్డెన్ గోపాల్, ఫోన్కాల్ మేజర్ గ్రామపంచాయతీ ఈఓ రాహుల్ పాల్గొన్నారు.

హాజీపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం వసతీ గృహాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత 40 శాతం ఆహార చార్జీలను, 16 ఏళ్ల తర్వాత కాస్మొటిక్ చార్జీలను 200 శాతం పెంచడంతో పాటు 14వ తేదీ నుంచి కొత్త సాధారణ ఆహార మెనూ అమలు చేపడుతోంది. ఇందులో భాగంగా శనివారం హాజీపూర్ మండలంలోని గఢ్పూర్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో హాజీపూర్ మండల ప్రత్యేకాధికారి, డీఆర్డీఓ కిషన్, దొనబండలో ఎస్సీ బాలుర వసతీ గృహంలో తహశీల్దార్ శ్రీనివాసరావు దేశ్పాండే, ముల్కల్ల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో మంచిర్యాల తహసీల్దార్ ఎండీ రఫతుల్లా హుస్సేన్, గుడిపేటలో మహాత్మ జ్యోతిభా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల మండల ఎంపీఓ ఉమర్ షరీఫ్ వసతి గృహాల అధికారులతో కలిసి కొత్త సాధారణ ఆహార మెనూ పట్టికలను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కొత్త ఆహార మెనూపై వివరిస్తూ ఏ రోజూ మెనూ ప్రకారం ఆహారం ఏర్పాటు చేయకపోయినా వెంటనే స్పందించి తమను నేరుగా సంప్రదించవచ్చని తెలియజేస్తూ ఫోన్ నెంబర్లను అందరికీ చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసి కొత్త ఆహార మెనూ ప్రకారం సిద్ధమైన భోజనాన్ని అధికారులు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. విద్యార్థుల తల్లిదండులు కూడా పలు సమస్యను అధికారుల దృష్టికి తీసుకారావాలన్నారు. గుడిపేట్ ఎంజేపీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల పలు ప్రదర్శనలు చేస్తూ అలరించారు. కార్యక్రమాల్లో ముల్కల్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మోహన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నగేశ్, గుడిపేట ఎంజేపీ ప్రిన్సిపల్ శ్రీధర్ పాల్గొన్నారు.



జన్నారం : బీసీ హాస్టల్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

తాండూర్ : బాలికలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం పురోగతి చెందుతుందని బెల్లంపల్లి తహసీల్దార్ జోష్న తెలిపారు. బెల్లంపల్లి సడీపీఓ స్వరూప రాణితో కలిసి బెల్లంపల్లి సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్లో నూతన మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాలలో పోటీపడినప్పుడే కుటుంబం సమాజం బాగుపడుతుందని తద్వారా దేశం పురోగతి చెందుతుందన్నారు. విద్యార్థినిలు చదువుతోపాటు ఆటలు, క్విజ్ వంటి విజ్ఞానం వినోద భరితమైన అంశాలలో ఉన్నతి సాధించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం 40 శాతం మెనూ చార్జీలను పెంచిందన్నారు. పెంచిన చార్జీలకు అనుగుణంగా మెనూ ప్రకారం తాజా కూరగాయలను నాణ్యమైన సరుకులను వాడి రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. సీడీపీఓ స్వరూప రాణి మాట్లాడుతూ బాలిక సంరక్షణ చట్టాలు మహిళ చట్టాల గురించి తెలిపారు. సమాజంలో మహిళల ప్రాధాన్యత వివరించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డు ఆఫీసర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

జైపూర్ : ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన మోనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. శనివారం స్థానిక బాలికల వసతీ గృహం సందర్శించిన ఆయన వసతీ గృహంలో విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సంధర్భంగా అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ మంచూ రియన్‌తో కలిసి విద్యార్థులు, వారి తల్లితండ్రులతో కలిసి మాట్లాడిన ఆయన గతంలో పంపిణీ చేసిన ఆహారంతో పోల్చితే కొత్తగా వచ్చిన మోనూ ప్రకారం ఆహారం వండి వడ్డిస్తున్న ఆహారంలో గల తేడాను అడిగి తెల్సుకున్నారు. అదేవిధంగా వసతీ గృహం పరిసరాలు పరిశీలించారు. వసతీ గృహం వంట గది, స్టోర్ రూం. డైనింగ్ హాల్, ఆర్వో ప్లాంట్ పరిశీలించారు. ఈ సంధర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు..

భీమారంలో..

మండల ప్రత్యేక అధికారి కల్పనతో కలిసి స్థానిక మండల పంచాయతీ అధికారి సతీష్‌రెడ్డి శనివారం స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సంధర్శించారు. వసతీ గృహంలో గల విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ఆహారం పరిశీలించిన ఆయన మోనూ ప్రకారం క్రమం తప్పకుండా నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. వంట చేస్తున్నప్పుడు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వంట గది ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని వసతీ గృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.



హాజీపూర్‌లో..



తాండూర్‌లో..



జైపూర్‌లో..

బీఆర్ఎస్ హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి

● మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



నవతెలంగాణ-మంచిర్యాల

బీఆర్ఎస్ హయంలో మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధి అయిందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సర కాలంగా నియోజకవర్గ అభివద్ధికి నోచుకోకపోగా పొగ వెనుకంజలో ఉందన్నారు.164 కోట్ల అంతర్గం బ్రిడ్జ్ ఇంటిగ్రెటెడ్ మార్కెట్ ఐబీ గెస్ట్ హౌజ్ లేకుండా చేశాడని ఆరోపించారు. పది వేల ఎకరాల కు సాగు నీరు అందించే పడ్తన పల్లి లిఫ్ట్ అతి గతి లేదు అన్నారు. మున్సిపాలిటీల అభివృద్ధి మరిచిపోయారని, డీఎంఎఫ్‌టీ నిధుల కింద నియోజక వర్గ అభివృద్ధికి విడుదలైన రూ.12 కోట్ల 56 లక్షల నిధులు రద్దు చేశారని, గత 20 సంవత్సరాలుగా మేము చేసిన అభవృద్ధి ప్రజలకు తెలుసని, గంజాయి, రౌడీ బ్యాచ్‌లను ఏనాడు ప్రోత్సహించలేదని నా పై తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. గత 20 సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధి, ప్రేమ్ సాగర్ రావు ఎమ్మెల్సీగా ఉన్నప్పటి నుంచి ఇప్పటికి జరిగిన విషయాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, పీఎస్ఆర్ చేస్తున్న పనులన్నీ ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని దివాకర్ రావు అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గాదే సత్యం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేష్ నాయకులు తోట తిరుపతి, తజోద్దీన్, గోగుల రవీందర్ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్ట్



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి-2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే స్టేషన్ ముందు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న పెద్దపల్లికి చెందిన ఎండీ జావీద్, ఎండీ సల్మాన్ అనే ఇద్దరు వ్యక్తులను పట్టుకొని అరెస్టు చేసినట్టు సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి 80 గ్రాముల గంజాయిని స్వాధీనపర్చుకుని పంచనామా నిర్వహించి, బెల్లంపల్లి-2 టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేదిత గంజాయి మాదకద్రవ్యాల సాగు రవాణా చేసి పట్టుబడిన వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందన్నారు. గంజాయి సాగు రవాణా వాడకం దారుల వివరాలు తెలిస్తే పోలీస్ వారికి సమాచారం అందించి బాధ్యతగా సహకరించాలని ప్రజలను కోరారు.

లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం



నవతెలంగాణ-జైపూర్

లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం కోసం పోలీసులు కృషి చేస్తున్నామని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. శనివారం ఉదయం భీమారం పోలీస్‌స్టేషన్‌ను ఆయన సంధర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు పరిశీలించారు. రాజీ మార్గమే రాజ మార్గం అనే నినాదంతో కేసుల పిర్యాదుదారులను కలిసి కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. స్థానిక ఎస్ఐ స్వేతతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులను పరిశీలించారు. జాతీయ లోకాదలత్ దినోత్సవాన్ని పురస్కరించుకుని చెన్నూర్ మున్సిఫ్ కోర్టులో నిర్వహించ తలపెట్టిన లోకాదలత్‌కు పిర్యాదుదారులను తరలించాలని సిబ్బందిని పురమాయించారు. సాధ్యమైనంత వరకు కేసుల పరిష్కారం కోసం పిర్యాదుదారులతో పాటు నిందితులను కలిసి ఇరువురు లోకాదలత్‌కు తరలించాలని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

తాండూర్ : రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేందుకు కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలో అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన బెల్లంపల్లి నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ సంవత్సర పాలనపై ప్రజల్లో అసంతప్తి ఉందని ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మిన ప్రజలు పట్టం కడితే ప్రజల్ని నమ్మించి నట్టేట ముంచారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి బద్దం లింగారెడ్డి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీష్ జైన్, సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ ఎనగందుల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సాంస్కృక ప్రదర్శన ఎంపిక పోటీలు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శన ఎంపిక పోటీలను సీసీసీలోని ఆఫీసర్స్ క్లబ్‌లో శనివారం నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలకు ఇన్‌చార్జి డీజీఎం(ప) రాజేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.15 పాటశాలలకు చెందిన 340 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిక కమిటీ సభ్యులు శ్యాంసుందర్, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

పాఠశాలలో వెజిటేబుల్ డే



నవతెలంగాణ-నస్పూర్

శ్రీ కృష్ణవేణి ప్లే స్కూల్‌లో గ్రీన్ డే అండ్ వెజిటేబుల్ డే సెలబ్రేషన్ ప్రీ ప్రైమరీ విద్యార్థులచే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బత్తిని దేవన్న మాట్లాడుతూ శ్రేయస్సును సూచించేది కలర్ గ్రీన్ అని మా చిన్నారి విద్యార్థులు గొప్ప ఉత్సాహంతో, ఆనందంతో, ఆకుపచ్చ రంగు దుస్తులతో ఆహ్లాదమైన వాతావరణంలో ఆశ్చర్యపరిచే ఆకుపచ్చ దుస్తులలో ఉత్సవంగా పాల్గొన్నారన్నారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత భాగంగా చెట్లను మనము కాపాడితే, చెట్లు మనకు రక్షణ ఇస్తాయని తెలిపారు. మనం ఆరోగ్యంగా ఉండడానికి వివిధ రకాల కూరగాయలు వివిధ రకాల ప్రోటీన్స్ మనకు అందిస్తాయని, వీటి వల్ల మనకు జ్ఞాపకశక్తి పెరగడం, ఎముకలు గట్టిపడటం, పెద్దవాళ్లకు బీపీ, షుగర్ తగ్గించడానికి విటమిన్ ఏ, విటమిన్ కె, విటమిన్ బి6 విటమిన్లు, ఆహార ఖనిజాలు, కార్బోహైడ్రేట్ల వంటి విటమిన్లు వివిధ నిష్పత్తుల్లో ఉంటాయని, అనేక కూరగాయల్లో ఫైబర్ కూడా ఉంటుందని, జీర్ణశయంతర పనితీరుకు ముఖ్యమైన పోషకాహారాలు పుష్కలంగా దొరుకుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేచినిలో వెంకటేశ్వర కళ్యాణం

నవతెలంగాణ-తాండూర్

రేచిని గ్రామములోని శ్రీ సంతాన దత్త సహిత శివకేశవ దేవస్థానంలో శ్రీదేవీ, భూదేవీ సహిత వేంకటేశ్వర కళ్యాణమహోత్సవం లలితా, దత్తహవనముల ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రాజరాజేశ్వరీ పీఠం, పెద్దతూండ్ల వారు సంకల్పించిన కోటి లలితా సహస్రనామ పారాయణంలో భాగంగా విశ్వనాథ గురుపీఠం ఆధ్వర్యంలో సుబ్బ దత్తుమూర్తి భాగ్యలక్ష్మి దంపతులు సమక్షంలో ఈ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా సహస్రనామ పారాయణం, శ్రీచక్రపూజ హవనము, కుండస్థాపన, అగ్నిప్రతిష్ఠ, ఆగమోక్త అగ్నిముఖం, పూర్వశాంతి హవనము, గణపతి, నవగ్రహ హవనములు, లలితా, దత్తహవనముల అనంతరం కల్యానోత్సవ పూజల్లో భాగంగా గణపతి పూజ, పణ్యాహవాచనము, నాందీ ప్రస్తావన, షోడశమాతృకాపూజ, రక్షాబంధనం, అఖండదీప స్థాపన, అంకురారోపణ, వసోర్ధార మొదలగు కార్యక్రమాలు జరిగాయి. తదుపరి శ్రీదేవీ, భూదేవీ సహిత వెంకటేశ్వర కల్యాణ మహోత్సవం నిర్వహించారు. నంతరంపోచమ్మగుడి, బీరయ్య గుడి, చిన్నగుడి వరకు పల్లకిసేవతో గ్రామ పర్యటన కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్న వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కవ్వాల్ అటవీ క్షేత్రంలో పర్యటించిన న్యాయమూర్తి

నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ అభయారణ్యంలో హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు మేజిస్ట్రేట్ వెంకటేశ్వరరావు పర్యటించారు. శనివారం ఆయన కవ్వాల్ అభయారణ్యంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. ఆయనకు స్థానిక అటవీశాఖ అధికారులు అభయారణ్యంతో పాటు వన్యప్రాణుల రక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఫారెస్ట్ చాలా బాగుందని మేజిస్ట్రేట్ అన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తూ నిరసన

నవతెలంగాణ-జన్నారం



గత నెల నవంబర్ 25వ తేదీ నుంచి ఢిల్లీలో శీతాకాల పార్లమెంటు సమావేశాలు నడుస్తుండగా బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కావాలని జనగణలలో బీసీ కులాల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య మండల నాయకులు గుడా అశోక్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లులో 33 శాతంలో సబ్ కోటాగా 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చేస్తున్న జాతీయ, రాష్ట్ర స్థాయి సంఘాల ఉద్యమాలకు మద్దతుగా బీసీ సంఘాల నాయకులు నిల్వాలని కోరారు. స్వతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచిపోయినాయి బీసీల సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నావి ఇకనైనా మూడోసారి బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడిన సందర్భంగా ఈ సారి ఈ పార్లమెంటు సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేసే బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని చంద్రయ్య కోరినారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం కరీంనగర్ జోన్ కన్వీనర్ కేపీ నరసింహులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోకన్వీనర్ కడార్ల నరసయ్య మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడెపు లక్ష్మీనారాయణ మాజీ ఎంపీటీసీ రాగుల శంకర్, దేవుని గూడ మాజీ సర్పంచ్ ముత్యం రాజన్న, మాజీ సర్పంచ్ భూసణ వేణి గంగాధర్ గౌడ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు మామిడి విజయ్, అత్తె రఘు మహేంద్ర సంఘం నాయకుడు పిల్లి నర్సయ్య బీజేపీమాజీ మండల అధ్యక్షుడు వీరాచారి ముదిరాజ్ సంఘం మండల ఉపాధ్యక్షుడు ఐలవేణి రవి, బాలిన మధు పాల్గొన్నారు.

ప్రమాదరహిత సింగరేణిగా తీర్చి దిద్దుదాం

● సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్



నవతెలంగాణ-నస్పూర్

రక్షణ నియమాలు పాటించి ప్రమాద రహిత సింగరేణిగా తీర్చిదిద్దుదామని సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఎస్ఆర్పీ-3,3ఏ గనిలో 55వ రక్షణ పక్షోత్సవాలను జనరల్ మేనేజర్(చీఫ్ ఆఫ్ సేఫ్టీ) చింతల శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ జనరల్ మేనేజర్ (సేఫ్టీ) రఘు కుమార్, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సూర్యనారాయణ, ఇన్‌స్పెక్షన్ కమిటీ కన్వీనర్ జనరల్ మేనేజర్ (ఐ అండ్ పీఎం) బత్తుల శ్రీనివాస రావు నాయకత్వంలో ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ చిప్ప వెంకటేశ్వర్లు అధ్యక్షతన, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, కమిటీ సభ్యులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమిటీ సభ్యులకు ఎస్ఆర్పీ3,3ఏ గని ఉద్యోగులు, అధికారులు ఘనంగా స్వాగతం పలకడం అభినందించదగిన విషయమని, సింగరేణిలో రక్షణపై తీసుకుంటున్న చర్యలను ప్రతి ఒక్క ఉద్యోగ అధికారి తెలుసుకొని ముందుకు వెళ్లాలని, ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే అందరూ ఎస్ఎంపీ, ఎస్ఓపీలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంతో ఉద్యోగులలో రక్షణ ప్రాముఖ్యతని పెంపొందించుకోవాలని, జీరోహం టార్గెట్ సాధించాలని సూచించారు. రక్షణ పరికరాలతో కంపెనీ నియమాలను పాటిస్తూ ఉండాలని కోరారు. గనిలో నిర్వహించిన ట్రైడ్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులు ప్రధానం చేసి, వారి నైపుణ్యాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ వెంకట్ రావు, ఎరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, తనిఖీ బృందం సభ్యులు పి.శ్రీనివాస్, ఉమా కాంత్, జనార్ధన్‌రెడ్డి, మోక డేవిడ్, జి శ్రీధర్ రావు, టి.పోశమల్లు, డా.మురళీధర్రావు, మనోహర్, కె.రాజేశ్వర్ రావు, రవి, గని రక్షణాధికారి మహేందర్, సంక్షేమాధికారి ఎస్ఎండీ గౌస్ పాషా పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో బెల్లంపల్లిలోని రాంజీ గోండ్ అనాథ నిలయంలో రూ. 2.60 లక్షల విలువ గల సంవత్సరానికి సరిపడా భోజన సరుకులు పంపిణీ చేశారు. శనివారం రాంజీ గోండ్ అనాథ నిలయంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికష్ణ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ హెచ్‌ఆర్ ఏజీఎం ఉమా శంకర్, లైజనింగ్ ఆఫీసర్ తిరుపతి, వెల్ఫేర్ ఆఫీసర్ సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-నేరడిగొండ



బజార్ హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామానికి చెందిన ఎం. సుధాకర్ కి మంజూరు అయిన రూ. 27 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మండల కేంద్రంలో అందజేశారు. ఇందులో మండల కన్వీనర్ రాజారామ్, నాయకులు చిలుకూరి భూమయ్య, సాయి చైతన్య, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, సకేశ్, మారుతి, అరుణ్, ప్రేమ్సింగ్ తదితరులు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నవతెలంగాణ-బెజ్జూర్

షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని అందుగుల గూడ గ్రామానికి చెందిన కోరితె ప్రవీణ్ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఎవరు లేని సమయంలో శనివారం కరెంట్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడడంతో ఇల్లు దగ్ధమైనట్టు బాధితుడు తెలిపారు. ఇంట్లో ఉన్న 10 క్వింటాళ్ల పత్తి, బీరువాలు, సర్టిఫికెట్లు కాలి బూడిద అయినట్టు పేర్కొన్నారు. ఆర్థిక సాయం అందించాలని బాధితుడు కోరారు.



మెనూ ప్రకారం భోజనం అందించాలి

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

నవతెలంగాణ-నేరడిగొండ

గురుకులాల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క అన్నారు. శనివారం మండలలోని లఖంపూర్‌లో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో న్యూ డైట్ మెనూను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు చనిపోతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటకు శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగానే న్యూడైట్ మెనూ, డైట్ చార్జీల పెంపు కార్యక్రమం చేపట్టిందన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించకుంటే అధికారులు, మీ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులతో అన్నారు. బాగా చదువుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, తాను ఎలాంటి సౌకర్యాలు లేనప్పుడే ఎస్టీ హాస్టల్‌లో చదువుకున్నానని అన్నారు. ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. పిలిస్తే పలికే అన్నగా ఎప్పుడు అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం విద్యార్థినిలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. తదనంతరం మంత్రి, ఎమ్మెల్యేలు బోథ్ ఎక్స్ రోడ్ వద్ద ఉన్న సోమన్న అర్బన్ పార్క్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండే విట్టల్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, స్థానిక మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, హాస్టల్ వార్డెన్ స్వప్న, ఆశ్రమ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



నేరడిగొండలో మంత్రి సీతక్క

లక్షెట్టిపేట : విద్యార్థుల నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శనివారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ పాఠశాల, గురుకుల బాలికల స్కూల్‌ల్లో భోజన మెనూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని, అందులో భాగంగా గురుకుల హాస్టల్ విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచిందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనా అందించాలన్నారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు ఖర్చుచేస్తుందని, అందుకు తగిన విధంగా విద్యా ఫలితాలు ఉండాలన్నారు. పౌష్టికాహారలోపం రాకుండా ఉండేందుకు మధ్యాహ్న భోజనంలో ప్రతీ రోజు పౌష్టికాహారంతో పాటు ప్రత్యేక మెనూను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశిత లక్ష్యం ఎంచుకొని ముందుకు సాగాలని, భవిష్యత్తులో మంచి ఉన్నత స్థానంలో ఉండాలని కోరారు. అనంతరం ప్రభుత్వం ప్రకటించిన మెనూను విడుదల చేశారు. తదనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రమ కళ్యాణి, వైస్ ప్రిన్సిపల్ కె .మహేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు పూర్ణచంద్రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్, మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నలిమెల రాజు పట్టణ కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ : కార్పొరేట్ పాఠశాల,కళాశాలకు దీటుగా గురుకులాల్లో నాణ్యమైన విద్య, పౌష్టికాహారంతో పాటు దుస్తులు అందిస్తున్నట్లు ఎంపీఓ సత్యానంద్ స్వామి అన్నారు. శనివారం స్థానిక మైనారిటీ గురుకుల పాఠశాలలో యూనిఫాం, డైట్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భ ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం వివిధ గురుకులాల్లో ఏకకాలంలో మెనూ కార్యక్రమం చేపట్టిందన్నారు. ముందుగా పాఠశాలలో కల్పించిన మౌలిక సౌకర్యాలు, కిచెన్, డైనింగ్ గదులను పరిశీలించారు. ఆ తర్వాత కళాశాల, పాఠశాలలోని అన్ని తరగతులను సందర్శించి విద్యార్థులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ బాయ్స్ -1 మైనారిటీ గురుకుల పాఠశాల అకాడమిక్ కోఆర్డినేటర్ హమీద్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



లక్షెట్టిపేటలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



ఇచ్చోడలో..

ఉపాధ్యాయుని కుటుంబానికి పీఆర్టీయూ ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

క్రియాశీల సభ్యత్వం కలిగిన ఉట్నూర్ మండలంలోని చందూర్తి యూపీఎస్ ఉపాధ్యాయులు భానోత్ విజయ్ మృతి చెందారు. శనివారం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ కుమార్ సంఘం సభ్యులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పీఆర్టీయూ సంఘ సహాయనిధి నుండి రూ.లక్ష సాయం అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి.నరసింహ స్వామి, జిల్లా గౌరవ అధ్యక్షులు గోవర్ధన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వినోద్ రెడ్డి, అజయ్ పవర్, మేస్రం శేఖర్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, జీ.ఈశ్వర్, రాష్ట్ర కార్యదర్శి సదానందం, జిల్లా కార్యదర్శి మదన్ లాల్, మండల ప్రధాన కార్యదర్శి జైవంత్, మండల బాధ్యులు బండు, కవిత, నార్నూర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, ఇంద్రవెల్లి అధ్యక్షులు పవర్ అంబాజీ, సీనియర్ కార్యకర్తలు ప్రేమ్‌దాస్, సంతోష్ కుమార్, బాదు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

అభిమన్యు గ్రూప్ ఆర్థిక సాయం

నవతెలంగాణ-నార్నూర్

ఇచ్చోడ మండలంలోని గుబ్బ గ్రామానికి చెందిన ఆదివాసీ బాలింత మహిళ మూడు రోజుల క్రితం అకస్మికంగా మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న అభిమన్యు గ్రూప్ సభ్యులు మూడు రోజుల పాప జీవితంలో వెలుగులు నింపడానికి శనివారం కుటుంబ సభ్యులకు రూ.30 వేల ఆర్థిక సాయం చేసి చేయూత నిచ్చారు. అదే విధంగా లక్ష్మి టెంట్‌హౌస్ యజమాని పన్నుపట్టే సుభాష్ సౌజన్యంతో రూ.25 వేల ఆవు, దూడను అందజేశారు. ఆర్థిక సహాయం అందించిన వారిలో అభిమన్యు గ్రూప్ అడ్మిన్ మేస్రం శేఖర్‌బాబు, పెందూర్ దీపక్, మేస్రం లింగు, మనుపట్టే సుభాష్, తొడసం నాగోరావ్, కొడప నగేష్, మేస్రం దేవ్‌రావ్, బాదు, మాణిక్‌రావ్, దేవ్‌రావ్ తదితరులు ఉన్నారు.

సెల్లార్లు పార్కింగ్ కోసమే

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ పట్టణంలోని ఆయా ప్రాంతాలలో ఉన్న దుకాణ సముదాయాల సెల్లార్‌లను అద్దెకు ఇవ్వకుండా, పార్కింగ్ కోసమే ఉపయోగించుకోవాలని నిర్మల్ మున్సిపల్ కమిషనర్ ముహమ్మద్ ఖమర్ అహ్మద్ సూచించారు. పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు ఇతర కారణాల దృష్ట్యా ప్రజా ఫిర్యాదుల మేరకు దుకాణ సముదాయాలు ఇతర నిర్మాణాలకు సంబంధించిన సెల్లార్లను గుర్తించామని, త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

17న సీఎం కప్ బేస్ బాల్ జిల్లా స్థాయి సెలక్షన్స్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 17న జిల్లా కేంద్రంలోని టీజీ బాలుర పాఠశాలలో సీఎం కప్ బేస్ బాల్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా క్రీడల అధికారిణి రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు పీఈటీ సారంగపాణికి ఉదయం 9గంటలకి రిపోర్ట్ చేయగలరని ఇతర వివరాలకు 9493001726 సంప్రదించాలని, ఇందులో ఎంపికైన వారు ఈనెల 18 నుండి 21 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారన్నారు.

అన్ని రంగాల్లో శిక్షణ అందించాలి

నవతెలంగాణ-తాండూర్

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా బోధన సిబ్బంది కృషి చేయాలని, శిక్షణ అందించాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి, తాండూర్ స్పెషల్ ఆఫీసర్ అంజయ్య అన్నారు. శనివారం ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి స్థానిక జ్యోతిబాపూలే గురుకులంలో నూతన మెనూను ప్రారంభించారు. విద్యార్థులకు పెరిగిన చార్జీలకు అనుగుణంగా నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు భోజనంలో తాజా కూరగాయలను, నాణ్యమైన సరుకులను వినియోగించాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, పెరిగిన వస్తువుల ధరలను పరిగణలోనికి తీసుకొని ప్రభుత్వం మెనూ చార్జీలను 40 శాతం పెంచిందని తెలిపారు. జ్యోతిబాపూలే గురుకులాల్లో పదవ తరగతి అనంతరం ఇంటర్, డిగ్రీ కోర్సులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల తరపున పెంచికల్‌పేటకు చెందిన మహేష్ మాట్లాడుతూ తాండూర్ జ్యోతిబాపూలే గురుకులంలో విద్యా విధానం బాగున్నప్పటికీ విద్యార్థులకు హాస్టల్ భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నేషనల్ హైవే, రైల్వేలైన్ మధ్యలో ఉన్న గురుకులంతో విద్యార్థులు ఎటు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని, గురుకులానికి కొత్త భవనం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వినోద్, బోధన సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ(ఎం) నాయకులు కోరారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యదర్శి తొడసం శంభు మాట్లాడుతూ కాలనీలో రోడ్లు సక్రమంగా నిర్మించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సూర్యభాన్, మోహన్, సుజాత, జంగేశ్వరి పాల్గొన్నారు.

పీడీఎస్ రైస్ పట్టివేత

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల నుండి చెన్నూర్ వైపుగా ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 6 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని (దాదాపు రూ. 18వేలు) టాస్క్ ఫోర్స్ సీఐ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ లచ్చన్న శనివారం పట్టుకున్నారు. నిందితుడు వానరసి అశోక్‌ను విచారణ నిమిత్తం నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

వంటల పోటీ

నిర్మల్‌టౌన్ : రాష్ట్ర విద్యా శాఖ సంచాలకులు ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే వంట సిబ్బందికి ఈద్గావ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం వంటల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల సహాయ కమీషనర్ శ్రీమతి పద్మ, విద్యా శాఖ పర్యవేక్షకులు వెంకట రమణ, మండల విద్యాధికారి నాగేశ్వర రావు, విద్యా శాఖ మధ్యాహ్న భోజన విభాగ జూనియర్ అసిస్టెంట్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు మోహన్ రావు, వంట సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ నెరవేరుస్తూ రెగ్యులర్ చేయాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతీక అధ్యక్షతన చేస్తున్న సమ్మె 5వ రోజు శిబిరం వద్దకు వచ్చి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 సంవత్సరాల నుండి సమగ్ర శిక్ష విభాగంలో పని చేస్తూ ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని వివరించారు. మద్దతు తెలిపిన వారిలో పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాస్, అనిల్ కుమార్, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చునర్కర్ తుకారాం, పుర్క మాణిక్‌రావ్, సంజయ్, లక్ష్మణ్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకులు ఊశన్న, రాజ్ కమలాకర్ రెడ్డి, రమేష్, హేమంత్ షిండే, తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ సంఘం రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నవీన్ రెడ్డి, బాలకిషన్ ఉన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి తుకారాం, ఉపాధ్యక్షురాలు నాగసుధ, కోశాధికారి నాగేష్, మీడియా ప్రతినిధి గేడేకర్ సంతోష్, సందీప్, పవన్, కేజీబీవీ ఎస్ఓలు నలంద, అరుణ, మీనా, కవిత, జిల్లా నాయకులు అనూప్, వెంకటరమణ, రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ సత్తా చాటాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బహుజన్ సమజ్ పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బూక్యరాజు అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటే విధంగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం కృషి చేస్తున్నట్టు వివరించారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి నిరంతరం పాటుపడుతున్నామన్నారు. అనంతరం ఆసిఫాబాద్ నియోజకవర్గ అభ్యర్థిగా కొట్నాక కిషన్, కెరమెరి మండల అధ్యక్షుడిగా కనక ప్రభాకర్‌ను నియమించినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ మెంబర్ ఎండీ సిరాజ్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఎనగందుల వెంకన్న, జిల్లా ఇన్‌చార్జ్ ఎండీ ముదస్సిర్ హుస్సేన్ పాల్గొన్నారు.

మహిళలకు వడ్డీలేని రుణాలందిస్తాం : మంత్రి సీతక్క



నవతెలంగాణ-బోథ్

మహిళలకు పెద్దపీట వేసి వడ్డీలేని రుణాలను అందిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. శనివారం మండల కేంద్రంలో పరిచయ గార్డెన్‌లో కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న కల్యాణ లక్ష్మి షాది ముభారక్ లాంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే చట్ట పరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. మిగితా జిల్లాల కంటే అదిలాబాద్ జిల్లా ధీటుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లాలో కలెక్టర్ పర్యటన చేస్తున్నారని అంగన్‌వాడీలు, హాస్టల్‌లలో నాణ్యమైన భోజనాలు, పరిశుభ్రత ఉండే విధంగా చూస్తున్నారన్నారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనీల్ జాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 388 మంది లబ్దిదారులకు రూ. 1,00,116 విలువ గల చెక్కులను అందించడం జరిగిందన్నారు. భారతదేశం ఎక్కడలేని విధంగా తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం బోథ్‌లో నూతనంగా నిర్మించిన సబ్ రిజిస్టార్ కార్యాలయాన్ని మంత్రి సీతక్క ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ విఠల్, కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ ఖుష్బూ గుప్తా, తహసిల్దార్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆకసం వార్షికోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ కవుల సంఘం 13వ వార్షికోత్సవాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని సత్యసాయి మందిరం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కు చెందిన ప్రముఖ కవి కారెం శంకర్‌కు ఆకసం కవి దివంగత డాక్టర్ వనపర్తి తిరుపతి స్మారక పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత కారం శంకర్ మాట్లాడుతూ కవి ప్రజల హృదయాలను గెలవాలన్నారు. కవి యాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్లి సామాజిక, సమకాలిన పరిస్థితులపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఆకసం పురస్కారాన్ని అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్ మాట్లాడుతూ సాహితి కార్యక్రమాల ద్వారా కవులు ప్రజల్లో చైతన్యం రగిలించాలన్నారు. సామాజిక సమస్యలపై కలం ఝుళిపించాలన్నారు. గౌరవ అతిథి రావుల రామన్న, కవి యాత్ర ప్రముఖులు బి.వెంకట్, ఆకస అధ్యక్షులు నల్లగొండ రమేష్ ఆకసం వార్షికోత్సవ ప్రాముఖ్యతను, సాహితీ సేవను వివరించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ కవుల సంగం కవులు అవధాని మాడుగుల నారాయణమూర్తి రచించిన అమ్మా శతకం, ధర్మపురి వెంకటేశ్వర్లు రచించిన వసుధా శతకం, దేవరాజు రేవతి రచించిన సుముఖని శతకం, మాడిశెట్టి శ్రీనివాస్ రాసిన నువ్వు నేను గోదారి కవితా సంపుటిగా సమీక్షను నిర్వహించారు. సమీక్షకులు ఢిల్లీ విజయ్ కుమార్, భూపతి సంతోష్, శ్రీరాం సత్యనారాయణ, రాజేశ్వరరావు, పుస్తక సమీక్షలు నిర్వహించారు. అనంతరం రచయితలు, సమీక్షకులు, అతిథులను ఆకసం ఆధ్వర్యంలో సత్కరించారు. కవులు మంచికట్ల రాజన్న, గుర్రాల వెంకటేశ్వర్లు, ఇందారపు మధుకర్ శర్మ, రాధా కష్ణచారి, కిల్లీ వెంకట్రావు, తాటిపల్లి జ్యోతి, కాశం సరిత, సాయిని శ్రీదేవి, నాగోరావు, పెంటయ్య, కీర్తిశేషులు డాక్టర్ వనపర్తి తిరుపతి సతీమణి వనపర్తి కాంతమ్మ, సాహితీప్రియులు, ప్రముఖులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో రాజీమార్గాన కేసుల పరిష్కారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా జడ్జి ఎంవీ.రమేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని న్యాయస్థానం భవన సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. యువరాజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె. అనంతలక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా సివిల్, క్రిమినల్ కేసులతో పాటు ప్రీ లిటిగేషన్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో సివిల్ కేసులు, సైబర్ క్రైమ్, ఈ చలాన్, బ్యాంక్ పీఎల్సీతో కలిపి 3288 కేసులకు గాను రూ.19,26,560 మొత్తాన్ని అపరాధ రుసుం రూపంలో వసూలు చేసినట్టు తెలిపారు. జిల్లా కేంద్రంలో మూడు బెంచ్‌లతో పాటు సిర్పూర్‌లో ఒక బెంచ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ తో 1771 కేసుల పరిష్కారం : ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు జిల్లా ప్రజల నుండి భారీ స్పందన వచ్చిందని ఎస్పీ గౌష్ ఆలం శనివారం తెలిపారు. లోక్ అదాలత్‌లో 1732 కేసులు గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో ఐపీసీ కేసులు 334 పరిష్కరించగా, 25 ఈ పెట్టి కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 1373 ఉండగా వాటికి రూ.13,73,000 ఫైన్ విధించినట్లు తెలియజేశారు. వీటన్నింటికీ అదనంగా జిల్లా వ్యాప్తంగా నమోదైన 39 సైబర్ క్రైమ్ కేసులలో బాధితులు పోగొట్టుకున్న రూ.8,46,764 డబ్బును తిరిగి వారికి అందించడానికి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.